క్లుప్తంగా

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే ప్రతాప్

నూజివీడు: పవిత్ర రంజాన్ మాసం పూర్తికానున్న నేపథ్యంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నియోజకవర్గంలోని ముస్లింలకు శుక్రవారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజుల పాటు కఠోర ఉపవాసాలు పాటించిన తరువాత ముస్లింలు ఈద్ చేసుకోవడం సంతోషకరమన్నారు.

సంతోషంగా రంజాన్ జరుపుకోండి

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): రంజాన్ పండగ వేడుకలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఎంఈఓ సీహెచ్ పుష్పలత అన్నారు. కేతనకొండ ఎంపీపీ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయులు ఇర్ఫాన్ పాషా సమకూర్చిన సేమియాలను ముస్లిం విద్యార్థులకు శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సర్పంచ్ నళినీఆశాలత, మండల కో–ఆప్షన్ సభ్యుడు నాగుల్‌మీరా, పీఏసీఎస్ చైర్మన్ సయ్యద్ జానీ, ఎంపీటీసీ సువర్ణ రాజు, గ్రేస్‌మినిస్ట్రీస్ డైరెక్టర్ ఎం.ఎలీషా, పాఠశాల కమిటీ చైర్మన్ నూర్జహాన్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మైలవరం: వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని తహసీల్దారు ముత్యాల శ్రీనివాసరావు తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మైలవరం సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బైపాస్ రోడ్‌లో రెవెన్యూ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దారు ముత్యాల శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. తహసీల్దారు మాట్లాడుతూ బైపాస్ రోడ్‌లో నిత్యం రెవెన్యూ, ఫారెస్ట్, అగ్నిమాపక కార్యాలయం, పోలీస్ స్టేషన్, తదితర కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు తాగునీటిని అందుబాటులో ఉంచేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

గంగినేని పీఏసీఎస్ చైర్మన్‌గా వెంకట్రావు



జి.కొండూరు: గంగినేని సహకార బ్యాంకు చైర్మన్‌గా గ్రామానికి చెందిన అన్నంశెట్టి వెంకట్రావు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ చేతులమీదుగా చైర్మన్‌కు శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలను అందజేసి సహకార వ్యవస్థపై విశ్వసనీయత పెరిగే విధంగా పనిచేయాలని సూచించారు. అదేవిధంగా డైరెక్టర్లుగా దుగ్గిరాలపాడు గ్రామానికి చెందిన నర్సింహరావు, తెల్లదేవరపాడుకు చెందిన సహదేవుడు నియమితులయ్యారు.

మత్తుపదార్థాల నివారణపై అవగాహన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మత్తుపదార్థాల నివారణపై అవగాహన సదస్సు నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. సంస్థ జోనల్ కో–ఆర్డినేటర్ ప్రియాంక స్క్రీన్ ప్రాజెక్టర్ ద్వారా మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే దుష్పరిణామాలు ప్రదర్శించి అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

గంపలగూడెం: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో 6,7,8,9 తరగతులు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు గంపలగూడెం కేజీబీవీ ప్రత్యేకాధికారి వెంకటలక్ష్మి తెలిపారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని, తమ కళాశాలలో 40 సీట్లు ఖాళీలున్నాయని పేర్కొన్నారు. వివరాలకు 92998 58518లో సంప్రదించాలని కోరారు.

ఇంటింటా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



పాతరావిచర్లలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని పాతరావిచర్లలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రతాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వారికి వచ్చిన పథకాల వివరాలను, అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కూడా ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. ఈ పథకాలన్నీ ఆగిపోకుండా కొనసాగాలన్నా, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలన్నారు. సచివాలయాలు, వైద్య కేంద్రాలు, రైతుభరోసా కేంద్రాలను గ్రామగ్రామాన ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ పాలనను వారి గడప వద్దకే తీసుకెళ్లిన ఘనత దేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మందికి నివేశన స్థలాలను అందజేయడమే కాకుండా పక్కా గృహాలను మంజూరు చేసి రూ.1.80 లక్షలు ఉచితంగా ప్రభుత్వం అందజేస్తోందన్నారు. గతంలో చంద్రబాబు ఒక్క సెంటు కూడా నివేశన స్థలాలు ఇవ్వలేదన్నారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, ఆయన మాటలను నమ్మొద్దని అన్నారు. జెడ్పీ వైఎస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, పాతరావిచర్ల సర్పంచ్ బసవరాజు అన్నపూర్ణమ్మ, ఉప సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, ఎంపీడీఓ సుందరి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సాంబశివరావు, నాయకులు బసవరాజు నగేష్, మధు, మోహన్, ముల్లంగి జమలయ్య పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో సదుపాయాలపై శ్రద్ధ వహించాలి

ముసునూరు: మండలవ్యాప్తంగా నిర్మించనున్న జగనన్న కాలనీల లే–అవుట్లలో సదుపాయాల కల్పనపై శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేకాధికారి, డీఎంహెచ్ఓ దయాల ఆశ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన అన్ని శాఖల పని తీరుపై శాఖల వారీగా శుక్రవారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టుకునేందుకు అనువుగా అంతర్గత రహదారులు, బోరు, విద్యుత్, తదితర సౌకర్యాలను తక్షణమే కల్పించాలని ఆదేశించారు. అన్ని లేఅవుట్లలోని ప్లాట్లకు సరిహద్దు రాళ్లు వేసి, వాటిపై నంబర్లను వేయించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సౌకర్యాలపై సమీక్ష చేసి, సక్రమ, సమగ్ర నిర్వహణపై సూపర్‌వైజర్లకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సత్యనారాయణ, ఏఈలు నరసింహారావు, సత్యప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

చాట్రాయి: ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఏపీఎం లక్ష్మీ కుమారి తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్నంపేటలో ఉపాధి పనులపై కూలీలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాదాపు వ్యవసాయ పనులు పూర్తవుతుండడంతో ఉపాధి పనులకు కూలీలను పెంచలా ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు.

ఒంటరి తనాన్ని పోగొట్టేది పుస్తక పఠనం



సదస్సులో మాట్లాడుతున్న కేశవరావు

మైలవరం: పుస్తక పఠనం ఒంటరి తనాన్ని పోగొట్టి సన్మార్గంలో నడిపిస్తుందని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కేశవరావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గ్రంథాలయం, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో డిజిటల్ యుగంలో పుస్తక పఠనం అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉత్తమ వ్యక్తిత్వ నిర్మాణంలో మంచి పుస్తకాలు దోహదం చేస్తాయన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో పుస్తక పఠనం అనుసరించవలసిన మెలకువలు విశదీకరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. అప్పారావు మాట్లాడుతూ బాల్యదశ నుంచే పాఠ్య పుస్తకాలతో పాటు మేధా సంపత్తిని సంతరింపజేసే విజ్ఞాన, వికాస, సామాజిక రంగాలకు చెందిన పుస్తకాలు చదవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే. హరినాధరెడ్డి, డీన్స్, వివిధ విభాగాధిపతులు,విద్యార్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు గొర్రెల పంపిణీ



లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి

రెడ్డిగూడెం: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో డ్వాక్రా మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం లబ్ధిదారులకు గొర్రెలను జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు మహిళల జీవనోపాధిని మెరుగుపరచడం, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు శ్రీనిధి, ఉన్నతి లింకేజీ రుణాల ద్వారా రెడ్డిగూడెం మండలంలో 20 మంది లబ్ధిదారులకు ఒక్కొక్క యూనిట్ కింద ఆరు గొర్రెలు, ఇన్సూరెన్స్, మెడికల్ కిట్ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లాది రాణీ, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్ట్, రెడ్డిగూడెం ఎంపీటీసీ సభ్యుడు కుప్పిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, వీరస్వామినాయుడు, కోటిరెడ్డి, ఎంపీడీఓ శంకరరావు పాల్గొన్నారు.

'బీజేపీని తరిమికొట్టి, దేశ భవితను కాపాడుకుందాం'

పోరాటనగర్(మైలవరం): ప్రజా తిరుగుబాటుతో కేంద్రంలోని బీజేపీని తరిమికొట్టి, దేశ భవితను కాపాడుకుందామని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. బరితెగించిన ఉన్మాదంతో దేశ విచ్ఛిన్నానికి, వినాశనకర, నిరంకుశ పాలన సాగిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజా తిరుగుబాటుతో తరిమికొట్టి దాని విషపు కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్న మన దేశాన్ని కాపాడుకుందామని పేర్కొన్నారు. మైలవరం మండలం పోరాటనగర్‌లో ప్రచార భేరీ 8వ రోజు కార్యక్రమానికి నాయకత్వం వహించి, కార్యకర్తలతో కలిసి శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కోటేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే దేశ భవిష్యత్తు పూర్తిగా నాశనమవుతుందన్నారు. ఇప్పటికే మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు రక్షణ రంగంతో సహా దారాదత్తం చేశారన్నారు. 32మంది ప్రాణ త్యాగంతో సాధించుకున్న తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక విశాఖ ఉక్కు పరిశ్రమను కూడా వదల్లేదన్నారు. కార్యక్రమంలో కారుమూరి రత్నకుమారి, డి. మార్గరేట్, భూక్యా బుజ్జి, మందా మేరీ, భూక్యా నగమ్మ, అజ్మీర బుజ్జి, కాటూరి నాగేశ్వరరావు, మందా ఎలీషారావు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఆగిరిపల్లి: వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.చంటిబాబు శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని వట్టిగుడిపాడుకు చెందిన సింహాద్రి నాగమల్లేశ్వరరావు (38) ఈ నెల 10వ తేదీన ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఇళ్ల దగ్గర, చుట్టు పక్కల వెదికినా ఆచూకీ దొరక్క పోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. అప్పులు ఎక్కువై మనస్తాపంతో ఇంట్లోంచి వెళ్లాడని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

చింతలపాడు(తిరువూరురూరల్): మండలంలోని చింతలపాడులో చేపల వేటకు వెళ్లిన ఒక వ్యక్తి విద్యుద్ఘాతానికి గురై శుక్రవారం మరణించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కోపూరి విశ్వనాథం(34) మరికొందరు వ్యక్తులతో కలిసి గుర్రపు వాగు వద్దకు వెళ్లగా చేపల గాలానికి విద్యుత్ తీగెలు తగిలాయి. విద్యుద్ఘాతానికి గురైన విశ్వనాథాన్ని గంపలగూడెంలోని ప్రైవేటు నర్సింగ్ హోంకు తరలించారు. చికిత్స పొందుతూ విశ్వనాథం మరణించాడు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేలను సారవంతం చేసుకోవాలి

పొందుగల(మైలవరం): నేలలో సేంద్రియ కర్బనం పెంచుకుని సారవంతం చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి సత్యవతి తెలిపారు. మైలవరం మండలం పొందుగల గ్రామం రైతు భరోసా కేంద్రంలో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేలను సారవంతం చేసుకుని విత్తనశుద్ధి చేసుకోవడం ద్వారా చీడపీడల బెడద తగ్గుతుందన్నారు. గ్రామ సర్పంచ్ గుగులోతు కోటమ్మరాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ ఆర్‌బీకే అడ్వైజరీ కమిటీ చైర్మన్ కోడే శ్రీనివాసరావు, ఏఓ సంధ్యారాణి, వీహెచ్ఏ అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను చెల్లించి సహకరించండి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీకి ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు కొండపల్లి ఐడీఏ పాలకవర్గం సభ్యులను కోరారు. ఐడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం ఆస్తిపన్ను చెల్లింపులపై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో నిధులు లేమితో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. త్వరగా పన్నులు చెల్లించాలని సూచించారు. ఐలా చైర్మన్ మద్దు రామలింగేశ్వరరావు పన్నులు చెల్లింపునకు 10 రోజులు గడువు కోరారు. దీంతో 10 రోజుల్లో చెల్లించే ఏర్పాట్లు చేయాలని కమిషనర్ సూచించారు.

కార్మికులకు సేఫ్టీ కిట్ల పంపిణీ

ఇబ్రహీంపట్నం: భవన నిర్మాణ కార్మికులకు అంజనీ సిమెంట్ ప్రతినిధులు శుక్రవారం సేఫ్టీకిట్లు పంపిణీ చేశారు. స్థానిక శివానీట్రేడర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ డిప్యూటీ మేనేజర్ రామాంజనేయులు అంజనీ సిమెంట్ వినియోగంపై అవగాహన కల్పించారు. సీనియర్ సేల్స్ అధికారి శేషగిరి టెక్నికల్ అధికారి రాజేష్, శివానీట్రేడర్స్ అధినేత యక్కల శివ, కళ్యాణ్, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

30లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

తిరువూరు: రబీ పంటలు సాగుచేసే రైతులు ఈ నెల 30వ తేదీలోపు తమ పంటల వివరాలను ఈకేవైసీ చేయించుకోవాలని తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు జీ కెనడీ కోరారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం గ్రామ వ్యవసాయ సహాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ–క్రాప్ ప్రయోజనాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, 1బీ నకళ్లు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్టు ఫొటో, బ్యాంకు ఖాతా జిరాక్సు ప్రతితో రైతు భరోసా కేంద్రంలో ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి పద్మ పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల్లోనూ సమగ్రాభివృద్ధి

ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: తిరువూరు పట్టణంలోని శివారు ప్రాంతాల్లో కూడా అభివృద్ధి పనులు చేపడుతున్నామని స్థానిక ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. తిరువూరు నగరపంచాయతీలోని 17వ వార్డులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గతంలో నివాసయోగ్యంగా లేని శివారు ప్రాంతాల్లో ఇప్పుడు సిమెంటు రహదారులు, రక్షిత మంచినీరు, వీధిదీపాలు ఏర్పాటు చేశామని తెలిపారు. నగర పంచాయతీ నిధులతో సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తంగెళ్లబీడు వంటి మారుమూల ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలతో పాటు ప్రజల కోరిక మేరకు మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు ఇన్‌చార్జి షేక్ జాకీర్, కౌన్సిలర్లు ఏరువ ప్రకాష్ రెడ్డి, పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, మోదుగు ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ

నూజివీడు: పట్టణ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి పాలకవర్గ సభ్యులందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అన్నారు. మున్సిపల్ పాలకవర్గ సాధారణ సమావేశం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో అనేక అంతర్గత రహదారులను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగ్గా నిర్వహించేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీధిలైట్లకు సంబంధించి కూడా ఎక్కడున్నా కొత్తవి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ వార్డుకు 10 వీధి లైట్లు చొప్పున 320 వీధిలైట్లను కొనుగోలు చేయాలన్నారు. 30వ వార్డు కౌన్సిలర్ నడకుదురు గిరీష్ మాట్లాడుతూ తన వార్డులోని మురుగు కాల్వలోని పూడికను తొలగించమని పలు మార్లు చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండో వైస్ చైర్మన్ షేక్ అమీరున్నీసాబేగం వ్యక్తిగత కారణాల వల్ల వైస్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆమె రాజీనామాను కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, టీపీఓ పెద వెంకయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాన్ని విజయవంతం చేసేందుకు కృషి

జి.కొండూరు: పేదలకు ఇంటి వద్దే వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వ లక్ష్యాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని అన్నారు. చెవుటూరులో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ఆమె శుక్రవారం పరిశీలించారు. స్థానిక వెల్నెస్ సెంటర్‌లో క్యాన్సర్ పరీక్షలను పర్యవేక్షించారు. క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకల్యాణి పాల్గొన్నారు.

సారా తయారీ, విక్రయాలు నిర్వహిస్తే కేసులు

చాట్రాయి: సారా తయారీ, విక్రయాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని నూజివీడు ఎస్ఈబీ సీఐ గోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం సారా అమ్మకందారులు, తయారీదారులను తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని అలాంటి వారిపై నిత్యం నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం 15 మందిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు.

సంక్షిప్త వార్తలు

అరుణాచలానికి ప్రత్యేక బస్సుసర్వీసు

తిరువూరు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలానికి తిరువూరు నుంచి మే 3న ప్రత్యేక బస్సుసర్వీసు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజరు వేణు తెలిపారు. వైశాఖ పౌర్ణమి నాడు అరుణాచలం ఆలయ గిరిప్రదక్షిణ చేసేందుకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈ బస్సు ఏర్పాటు చేశామని, 3వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు తిరువూరు నుంచి బస్సు బయల్దేరుతుందని తెలిపారు. మార్గమధ్యంలో శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం (గోల్డెన్ టెంపుల్) దర్శనం చేసుకోవచ్చని తెలిపారు. గురువారం రాత్రి అరుణాచలం చేరుకున్న అనంతరం భక్తులు గిరిప్రదక్షిణ పూర్తిచేసిన తర్వాత 5వ తేదీ మధ్యాహ్నం తిరిగి బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. తిరువూరు నుంచి అరుణాచలానికి ఈ బస్సులో టికెట్ ధర రూ.2800 గా నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 98856 61835లో సంప్రదించాలని కోరారు.

అదనపు సౌకర్యాలు ఏర్పాటు చేయాలి

నూజివీడు: గత వారం రోజులుగా ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధ్యాయులు మృత్యువాత పడుతున్నందున ఒత్తిడి తగ్గించేలా మూల్యాంకన గడువును పెంచాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డొక్కు శ్రీనివాసరావు, కేసాని ప్రభాకరరావు విజ్ఞప్తి చేశారు. మూల్యాంకన కేంద్రాలను వీలైనంతవరకు ఎండ తీవ్రత తక్కువగా, చల్లదనం ఉండే కేంద్రాలకు మార్చాలన్నారు. వారం రోజుల్లోనే మూల్యాంకనాన్ని పూర్తి చేయాలన్న గడువును తొలగించి కొన్ని రోజులు పొడిగించాల్సిన అవసరం ఉందన్నారు. వయసు రీత్యా మూల్యాంకనానికి రాలేమని ఎవరు కోరతారో వారిని రిలీవ్ చేయాలని, మూల్యాంకన కేంద్రానికి 30 కిలోమీటర్లు కంటే ఎక్కువ దూరం నుంచి వస్తున్న ఉపాధ్యాయులను కూడా వీలైనంత మేరకు మూల్యాంకన విధుల నుంచి రిలీవ్ చేయాలని సూచించారు.

వైఎస్సార్ బీమాతో ధీమా

ముసునూరు: వైఎస్సార్ బీమాతో పేదల జీవితాలకు ధీమా ఏర్పడుతుందని ముసునూరు ఎంపీటీసీ చీలి లక్ష్మి అన్నారు. గ్రామానికి చెందిన కొడవలి జ్యోతి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. ఆమె వైఎస్సార్ బీమా పథకానికి అర్హురాలు కావడంతో తక్షణ సాయం రూ.10,000 అంతిమ సంస్కారాల కోసం నామినీగా ఉన్న కుమారుడు రాజేష్‌కు అందజేశారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతికి సంతాపం

విస్సన్నపేట: మండలంలోని కలగర రామచంద్రాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు భీమిరెడ్డి వెంకట జయరామిరెడ్డి (70) అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే రక్షణనిధి జయరామిరెడ్డి మృతదేహానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, కలగర సర్పంచ్ దేశిరెడ్డి రమ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మురుగునీటి పారుదలకు చర్యలు

ఇబ్రహీంపట్నం: 24వ వార్డులో మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. మున్సిపల్ సిబ్బందికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో మురుగునీరు పారుదలకు సిబ్బంది మార్గం సుగమం చేశారు.

పందుల పట్టివేతకు సహకరించండి

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో విచ్చలవిడిగా సంచరిస్తున్న పందుల పట్టివేతకు గ్రామస్తులు సహకరించాలని ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శి బి.ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. పందులు సంచరిస్తున్నట్లు గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు రావడంతో జంగారెడ్డిగూడెం నుంచి పందులు పట్టేవారిని పిలిపించి శుక్రవారం 30 పందుల వరకు పట్టించినట్లు పేర్కొన్నారు.

పైలట్ ప్రాజెక్టు పథకాన్ని పరిశీలించిన అధికారులు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో పైలట్ ప్రాజెక్టు మంచినీటి సరఫరా పథకాన్ని శుక్రవారం అధికారులు పరిశీలించారు. పైలట్ ప్రాజెక్టు పథకం ద్వారా సరఫరా అవుతున్న నీటిలో పురుగులు ఉంటున్నాయని, వాసన వస్తుందని ఆగిరిపల్లి–2 ఎంపీటీసీ సభ్యుడు సాదం గోపీనాథ్‌కు పలువురు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ కె.వాణి, పంచాయతీ కార్యదర్శి బి.ప్రసాద్‌తో కలిసి పైలట్ ప్రాజెక్టును సందర్శించి పరిశీలించారు. అక్కడ ప్రాజెక్టులో ఫిల్టర్ బెడ్‌లో పాకుడు ఎక్కువగా ఉండటం గుర్తించారు. డీఈ మాట్లాడుతూ నీటిని శాంపిల్ తీసి పరీక్షలకు పంపాలని ఎంపీడీఓను ఆదేశించారు.

'జగనన్నే మాభవిష్యత్'కు విశేష స్పందన

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది. ఇబ్రహీంపట్నం, కొండపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జొంతా సాంబశివరావు, కన్వీనర్ల కోఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, పీఏసీఎస్ చైర్మన్ మునగాల శివారెడ్డి పాల్గొన్నారు.